# 'ఆషాఢ మేఘాలు'

రచన:
శ్రీ బి. నాగేశ్వరరావు

బస్సు వేగంగా పరుగెడుతోంది.

ఆదే వేగంతో నా ఆలోచనలు పరుగెడుతున్నాయి.

వర్షాకాలంలో నాలుగురోజులుగా సెలవులు దొరికాయి. పదహారు సంవత్సరాల సుదీర్ఘ కాలం. తర్వాత ప్రథమంగా మా మేనత్తగారి వూరు రాంపాడుకు వెలుతున్నాను. ఈ మధ్యకాలంలో వారికీ మాకూ రాకపోకలు లేవు. ఇటీవల ఒక వివాహసందర్భంగా మామయ్య కనిపించి, మాటలు కలిపాడు. గతాన్ని మరచిపోయి హాయిగా తృప్తిగా మాట్లాడుకున్నాము. ఊరికి రమ్మని బలవంతం చేశాడు. సరేనన్నాను తర్వాత మా అత్తకూతురు ఇందుమతి తప్ప కుండా రావాలంటూ రెండు ఉత్తరాలు రాసింది. వీలు చూసు కొని బయలుదేరాను. ఇందూను పుట్టినప్పటినించీ నేను చూడలేదు. ఎలా వుంటుందో? అత్తగారి ఊరు రాంపాడు లాగా అందంగా ఆనందం కలిగించేలా వుంటుందో?

రాంపాడులో నా బాల్యంలో కొన్ని సంవత్సరాలు గడి పాను. పసిడి యిసుక తిన్నెలు, తెలివెన్నెల కెరటాలు, ప్రశాంతంగా, నిండుగా పారే నదీ, పచ్చని తోటలూ, చల్లని గాలులూ, ప్రకృతి సంపదలకు నిలయం రాంపాడు పల్లెసీమ.

చిన్నతనంలో అత్తయ్య చేతి గోరుముద్దలు తింటూ, నిసర్గమైన ప్రకృతి వడిలో అమాయికంగా, ఆనందంగా రాంపాడులో గడిపిన రోజులెన్నో వున్నాయి. ఆ మధుర మైన దినాలు గతించినా, వాటి తాలూకు మధుర స్మృతు లింకా నా మనో మందిరంలో నిత్యం అవిష్కారం అవు తూనే వున్నాయి అవన్నీ పదిలంగా యీనాటికీ నా ఎదలో దాచుకున్నాను. ఇన్నాళ్ళని మళ్ళీ రాంపాడుకు వెళ్ళటం తటస్థించింది. నా అనుభూతులను తిరిగి అనుభవాలుగా చేసుకొనే అవకాశం లభించింది. గతంలో కన్నా ప్రస్తుతం రాంపాడు ప్రత్యేక ఇందూ.

ఆషాఢ మాసం. ఆకాశం మేఘావృతం అయింది. చల్లగా గాలి వీస్తోంది. మెల్లిగా చినుకులు రాలుతున్నాయి. రోడ్డు కిరువైపులా గల ప్రకృతిలోంచి మట్టి వాసనా, పూల వాసనా కలిపి చల్లని గాలి వీస్తోంది. ఇందుమతి గురించి మనోహరంగా ఊహించుకుంటున్నాను. హృదయం ప్రఫుల్లమవుతోంది. కుహూమంటూ కోయిల కూస్తే, మధు రంగా భ్రమరం పాడితే, సుగంధ పరిమళ భరితమైన మలయమారుతం వీస్తుంటే ఊహాసుందరి ఇందూ రూపం కవ్విస్తుంటే నాలో భావికవిత్వం పురి విప్పుకుంటోంది. బస్ ఎంజిన్ ధ్వనిలో సప్తస్వరాలూ వినిపిస్తున్నాయి. పరి సరాలు మరచిపోయి ఊహా లోకంలో తేలి పోయాను. సుదీర్ఘ ప్రయాణం ఏమాత్రం విసుగనిపించలేదు. మధ్యలో చిరు కునుకులు తీశాను.

సాయంత్రం ఆరు గంటలకు రాంపాడు చేరాను.

మామయ్య, వెంట యిద్దరు నౌఖర్లతో నన్ను రిసీవ్ చేసుకున్నాడు. నౌఖర్లను గుర్తుపట్టి పలకరించాను. వాళ్ళు నా లగేజ్ అందుకున్నారు. రాంపాడు పరిసరాలను గమ నిస్తూ కదిలాను. పచ్చని ఆకులచాటున ఒదిగిన చెండుమల్లె లాగా అందంగా కనిపించింది. ఆశ్చర్యంతో—

'ఊరు చాలా మారిపోయింది మావయ్యా!' అన్నాను.

'నీలాగే.' అన్నాడాయన నవ్వుతూ.

వీధులన్నీ పరికించాను. రాంపాడు పల్లె, పట్టణం పోలి కలను సంతరించుకుంటోంది. పల్లె ఎలా అభివృద్ధి చెందిందో మామయ్య వివరించి చెబుతుండగా యిల్లు చేరాము. యిల్లు కూడా చాలా మారిపోయింది. డాబా యిల్లు చక్కని బంగళాగా రూపొందింది.

వాకిట్లో అడుగు పెడుతుండగానే అత్తయ్య ఎదురైంది. చేతులు పట్టుకుని ఏదో అనబోతుంది కాని హర్షాతిరేకంతో ఆమె నోరు పెగలటం లేదు. ఆమె కళ్ళలో ఆనంద బాష్పాలు వెల్లువలవుతున్నాయి. నేనూ చాలా కాలం తర్వాత ఆమెను చూడటంవల్ల కలిగిన ఆనందాతిరేకంతో తబ్బి బ్బయ్యాను. ఆమె గొంతు పెగల్చుకుని అంది—

'ఇంతకాలం ఈ అత్తయ్యని వదలి ఎలా వుండగలి గావురా!'

పశ్చాత్తాపంతో మొదలంటా చలించాను. వంగి పాదాలు స్పృశించి క్షమాపణ చెప్పుకోవాలనుకునే లోపే ఆమె వారిం చింది.

తర్వాత స్నానాదులు ముగించాను. ప్రయాణ బడలిక తీరింది.

ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు
ఆధారపడునవి

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

లోధ్ర

✲

గర్భపోషణకు సుఖ ప్రసవమునకు

గర్భరక్షక

✲

వేవిళ్ళకు, మలబద్ధకమునకు

మాదీఫల రసాయనం

✲

ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి

సౌభాగ్యశొంఠి

✲

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్,

మద్రాసు - 600 014.

ఏజెంట్లు :

సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్)

విజయవాడ - సికిందరాబాద్.

వచ్చి అరగంటయినా ఇందూ కనిపించలేదు. కవ్వించే విశాల నయనాలు కళ్ళ బడలేదు. ఆతురత అణుచుకో లేక—

'అత్తయ్యా ఇందూ ఏదీ! కనిపించదేం ?' అనడిగాడు.

'చెప్పటం మరిచాను. స్నేహితురాండ్లతో పట్నం వెళ్ళింది. నీవు వచ్చేసరికంతా వచ్చేస్తానంది. బస్ మిస్స యిందో ఏమో!' అందామె.

చీకటి పడింది. ఎనిమిది గంటలనుంచి. ఇందూ కోసం కాచుకున్నాను. ఎనిమిదిన్నర గంటలకు భోజనాలయ్యాయి. బస్టాండుకు మావయ్య, ఒక నౌఖరు ఇందూ వస్తే తీసుకు రావడానికి వెళ్ళారు. అత్తయ్య వంటపని ముగించి నా గదిలోకి వచ్చి తీరుబాటుగా కూర్చుని గత పదహారు సంవత్సరాల వింతలూ విశేషాలూ ఏకరువు పెట్టసాగింది. నేను మంచంపై వెల్లకిలా పడుకుని ఇందూ కోసం నిరీక్షిస్తున్నాను. ఉన్న నాలుగు రోజులూ అందాల రాశి అయిన ఇందూతో హాయిగా ఆనందంగా గడపాలనీ సరదాగా షికార్లు చెయ్యాలనీ ఏవేవో కలలు కంటున్నాను. ఎవరో కవి చెప్పిన పద్యం గుర్తుకొచ్చింది.

'తప్త ధారుణీ గర్భ సంతృప్తి గోరి
అమృత ధారల గురిసె నాషాఢలక్ష్మి
అటులె, నీ మృదు సుధాదరహాస ప్రభల
నా ఎద గురియ రావె! నన్నాదుకోవె!'

అలా నా ఊహా లోకంలో నేనుండగా పది గంట లయింది. అప్పుడు మావయ్య ఇందూను వెంటబెట్టుకొని వచ్చాడు. తల్లీ తండ్రితో ఇందూ నా గదిలోకి వచ్చి—

'నమస్తే బావా!' అంది.

తలెత్తి చూశాను. నిలువునా నీరైపోయాను. నల్లగా, మెల్లకన్నుతో, అస్తవ్యస్తంగా ధరించిన దుస్తులతో ఒక అమ్మాయి నా ఎదుట సాక్షాత్కరించింది. నా ఊహాసౌధాలు కుప్పకూలి పోయాయి. అఘాతం నన్ను తెలియని నీరసం కమ్మివేసింది. నిశ్చేష్టుడనై అలాగే వుండిపోయాను.

'మాట్లాడవేం బావా!' అంది ఇందు కలుపుగోలుగా కొంచెం దగ్గరగా వచ్చి. గొంతు కూడా కఠోరంగా వుంది. ఏదో మాట్లాడాను. తర్వాత అంతా వెళ్ళిపోయారు. మంచంపై ఇలా పడిపోయి వాలిపోయాను. చంద్రుని కోసం చకోరిలా కాచుకుని వున్న నాకు చంద్రబింబం కని పించలేదు. నా హృదయం ఎంతో బాధగా మూలిగింది. నాల్గు రోజులు వుండాలని వచ్చిన నేను రేపు మధ్యాహ్నం

మధ్యాహ్నం నించే వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను. ఆ రాత్రి చాలా ప్రొద్దుపోయింతర్వాతగాని నిద్ర పట్టలేదు నాకు.

'లోపలికి రావచ్చా?' అని గది బయటినించి కమ్మని ఒక కంఠం వినిపించింది.

'ఆఁ!' అన్నాను అప్రయత్నంగా.

వెంటనే ఒక అందమైన అమ్మాయి కాఫీ కప్పుతో లోనికి వచ్చింది. అడక్కున్నా తనను తాను పరిచయం చేసుకుని కాఫీ కప్పు టేబిల్‌పై పెట్టి వెళ్ళిపోయింది. నేను నిర్వేదంగా కప్పు అందుకున్నాను. అత్తయ్య గదిలోనికి వచ్చి—

'టిఫిన్ ఏం చెయ్యమంటావురా భాస్కర్!' అంది.

'ఇప్పుడిక టిఫిన్ ఎందుకు లే, ఏకంగా భోజనం చేసి వూరి కెళతాను.' అన్నాను తలొంచుకుని.

అత్తయ్య నొచ్చుకుంటూ—

'అదేవిట్రా వచ్చి ఒక రాత్రయినా గడవలేదు. అపుడే వెళతానంటావు. నాల్గు రోజులు గడిచేదాకా వెళ్ళనివ్వను.' అంది.

నేనేదో చెప్పబోయేంతలో వెళ్ళిపోయింది.

తర్వాత టిఫిన్‌కి డైనింగ్ హాలు కెళ్ళాను. అక్కడ కమల కనిపించింది. నేను ప్రవేశించగానే ఆమె నిష్క్రమించింది. మా ఇందూ యిలా అందంగా వుంటే ఎంత బాగుండును అనుకుని విచారంగా, విషాదంగా నవ్వుకున్నాను. జీవితమే అంత. అనుకున్నది ఎప్పుడూ నెరవేరదు.

వచ్చినప్పటి నుంచి అలా దిగాలుగా వున్నావేంరా?' అత్తయ్య గద్దించింది ప్రేమగా.

'అబ్బే, ఏం లేదు.' అన్నాను పొడిగా.

టిఫిన్ ముగించి నడవాగుండా పెరట్లోకి వెళదామని నడవసాగాను. నడవా ముందరగల స్టోర్ రూం నించి మా మామయ్య కంఠం వినిపించింది.

'ఏమ్మా! ఇంకెంత సేపూ బావని ఆట పట్టించడం?'

'మధ్యాహ్నం భోజనాలయ్యే దాకా.' కమ్మని గొంతు.

ఆశ్చర్యంతో గదిలోకి చూశాను. కమల! ఒక్క క్షణంలో అంతా అర్థమయింది. సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయి పోయాను. చల్లగా నా గది చేరి మంచంపై ఏమీ ఎరగనట్లు పడుకున్నాను. కొద్దిసేపు తర్వాత కమల నా గదిలోకి వచ్చి—

'స్నానానికి లేవండి.' అదిలి.

నేను పలకలేదు.

వీ... ఎలక్ట్రిక్ మోటార్లను జాగ్రత్తగా కాపాడుకొనుటకు
మా స్విచ్చులు, స్టాటర్‌లనే ఉపయోగించండి.



వీరు... DEX

మోటార్లు కొనేముందు
వాటిమీద "డీలక్సు"
గుర్తున్నదా
అని చూచి కొనండి.

ఆంధ్రప్రదేశమునుంచి, ఏజంట్లు మరియు
డిస్ట్రిబ్యూటర్ల దరఖాస్తు కోరబడుచున్నాము.

: వివరములకు :

Phone: 30165

DELUX FOUNDRY

PATEL ROAD COIMBATORE - 640 009

'మిమ్మల్నే....అత్తయ్య పిలుస్తోంది '

'ఇలా రా.' అన్నాను చివాలున మంచంపై నించి లేచి.

'నేనా ? ఎందుకూ ?' అంది కమల భయంగా.

'రా చెబుతా.'

దగ్గరగా వచ్చింది. వెంటనే పొడవాటి వాలుజాడ పట్టుకున్నాను. ఇందూ కిలకిలా నవ్వింది. నా ఎదలో వెన్నెల జల్లు కురిసింది.

'అమ్మ దొంగా ఎంత నాటకం ఆడావు ?' అన్నాను.

'ఎలా వుంది ?'

'నీకెలా వుందో....నాకు మాత్రం చాలా బాధగా వుండింది.'

'నీకా మాత్రం శిక్ష పడాల్సిందే !'

'ఎందుకో ?'

'ఇన్నాళ్ళూ మా యింటిని మరిచిపోయినందుకు.'

అత్తయ్యా, మామయ్యా గదిలోనికి వచ్చారు. ఇందూ జడని చప్పున వదిలేశాను. అత్తయ్య మురిసెంగా నవ్వుకుంటూ—

'నీ రహస్యం తెలిసి పోయిందేమిటే బావకి !' అంది.

అందరం హాయిగా నవ్వుకున్నాం.

'వంట చేస్తాను. భోజనం చేసి వెంటనే మీ వూరికి వెళతావటరా ?' అంది అత్తయ్య తమాషాగా.

నేను వెంటనే అన్నాను.

'అబ్బే, నాకు నేటి నుంచీ నాలుగు రోజులు సెలవు అత్తయ్యా! ఎందుకు వృధా చెయ్యాలి. ఇక్కడే మీతో హాయిగా గడిపేస్తాను.'

మళ్ళీ అందరం హాయిగా నవ్వుకున్నాం.

'ఇందూ ! బావకి ఊరంతా చూపించు. ఇకనుంచీ వాడి చార్జి నీకే అప్పగిస్తున్నాను. నేను మూడు రోజులు పాటు పట్నం వెళుతున్నాను.' అన్నాడు మామయ్య.

ఊరంతా తిరిగాం. ఏటి వద్దున యిసకలో పరుగులు పెట్టాం. చెన్నకేశవస్వామి ఆలయంలో హారతులందుకున్నాము. మామయ్యగారి ద్రాక్షీ తోటలూ, మామిడి తోటలూ వగైరాలు చూశాం. రెండోరోజు మధ్యాహ్నం మాట్నీకని పట్నం వెళ్ళాం.

ఇంటర్‌వెల్‌లో ఇందు అంది—

'నేను నిజంగా అందంగా లేకపోతే, నీవు నిరుత్సాహంగా వెంటనే వెళ్ళిపోయేవాడివే కదా బావా ?'

'ఊఁ.' అన్నాను తలొంచుకుని.

'అంటే అందానికి ప్రాధాన్యత యిచ్చి మమతలూ, మమకారాలూ విస్మరిస్తావా ?'

ఇందూ హృదయం నాకు అర్థమయింది. కొద్దిసేపు మౌనంగా వుండి, తర్వాత ఇందు కళ్ళలోకి చూస్తూ నెమ్మదిగా అన్నాను.

'ప్రతి మనిషీ తన జీవితంలో ప్రతి అంశాన్ని, ప్రతి క్షణాన్నీ ఎంతో అందంగా ఊహించుకుంటాడు. ఊహలు నిజమైతే పొంగి పోతాడు. కలలయితే కృంగి పోతాడు. ఇది మానవ జీవితంల్లో సహజం. తర్వాత సుఖ దుఃఖ మిశ్రితమైన ఈ ప్రపంచంలో తానే రాజీ పడిపోయి యధావిధి జీవితను సాగిస్తాడు. చూడు నా స్థానంలో నీవు ఉంటే....'

ఇందూ బదులివ్వలేదు.

'చెప్పు. నీవేం చేసేదానివి ?'

ఇందూ కొద్దిసేపు తటపటాయించింది. తర్వాత నా చేతిని తన చేతులలోకి తీసుకుని వేడుకోలుగా అంది—

'సారీ బావా ! నీ ఊహలలాగే నా ఊహలూ నిజమయినాయి. మనమెంతో అదృష్ట వంతులు.'

ఇందూ హస్తాలను నెమ్మదిగా నొక్కాను - నా ఆశకు తగిన భార్యను పొందినందుకు.

TRADE MARK Panju TEX
మన్నికకు, ఆహ్లాదానికి....
పంజు టెక్స్‌వారి
♦ మాస్టర్ ♦ ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.